
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



సోమశిలలో 34.260 టీఎంసీలు

జలాశయంలో శనివారానికి 34.260 టీఎంసీలు ఉన్నాయి. 12,439 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, డెల్టాకు 1100, పవర్ టర్నెల్‌కు 2,500, ఉత్తర, దక్షిణ కాలువలకు 3700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,290
3 శాతం జీఎస్టీతో	రూ.9,569
నవర (8 గ్రా)	రూ.76,552

గరిష్టం/కనిష్టం 38.7 /29.5

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శనివారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

చెడు వ్యసనాలకు యువత బానిస

- మత్తులో నెల్లూరులో హత్యలు మితిమీరుతున్నాయి
- రాజ్యసభ సభ్యుడు ఏఏ రహీం



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్‌ఐ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): దేశంలో యువత చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తు, జీవితాన్ని కోల్పోతున్నారని కేరళకు చెందిన రాజ్యసభ సభ్యుడు, డీవైఎఫ్‌ఐ ఆల్ ఇండియా అధ్యక్షుడు ఏఏ రహీం ఆందోళన వ్యక్తం చేశారు. 'డ్రగ్స్ వద్దు–ఆరోగ్యం ముద్దు', 'డ్రగ్స్ అంతం డీవైఎఫ్‌ఐ పంతం' నినాదాలతో శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో యువత అయ్యప్పగుడి సెంటర్ నుంచి వేదాయపాళెం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు రహీం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చెడు వ్యసనాలకు, డ్రగ్స్, గంజాయి సేవిస్తున్న యువత ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులో యువత మత్తులో ఉంటూ ఏమి చేస్తున్నారో కూడా అర్థంకాక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఈ క్రమంలో హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు నాయకులు యువతను ప్రధాన శక్తిగా వాడుకుంటూ యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విచ్చలవిడిగా జరిగే మద్యం అమ్మకాలను అరికట్టాలని, గంజాయి, డ్రగ్స్‌ను నివారించేందుకు అధికార యంత్రాగం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నెల్లూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, శశి, సీపీఎం సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, కట్టా సతీష్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు




దివ్యకు ల్యాప్‌టాప్‌ను బహూకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే వాణి ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీనివాస్ న్యాయ సేవాధికార సంస్థ ప్రయోజనాలను, లక్ష్యాలను వివరించారు. వరంగల్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న గండిపోయిన దివ్య తన ఆర్థిక ఇబ్బందులను తెలియజేస్తూ జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకుంది. తన విద్యకు ల్యాప్‌టాప్ అవసరమని, తనకు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేదని పేర్కొంది. ఈ విషయం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ దృష్టికి వచ్చింది. ఆయన మానవతా దృక్పథంతో కావలి విశిష్ట కాలేజీ కరస్పాండెంట్ సుధాకర్ ద్వారా ల్యాప్‌టాప్ కొనుగోలు చేయించి, న్యాయ విజ్ఞాన సదస్సులో ఆ విద్యార్థినికి బహూకరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయ్యప్ప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఉద్యోగులపై దత్తత కత్తి



పేదరికం నిర్మూలన పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్‌షిప్) ఉద్యోగుల పాలిట శాపంగా పరిణమించింది. సమాజంలోని ధనవంతులు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పరిపుష్టి చేసి బంగారు కుటుంబాలుగా మార్చాలన్నదే ఈ పీ4 ముఖ్య ఉద్దేశం. ఈ పథకాన్ని ముందుగా ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉంది. అయితే ఈ పథకానికి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికార వర్గాల నుంచి స్పందన కరువైంది. ఈ క్రమంలో ప్రతి శాఖ అధికారికి టార్గెట్లు ఇచ్చి ప్రతి ఉద్యోగి రెండు కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ ఒత్తిడి పెంచుతున్నారు.



- పీ4 పథకాన్ని అమలు చేయాలని తీవ్ర ఒత్తిడి
- ఒక్కొక్కరూ రెండేసి కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఆదేశాలు
- డీఎంహెచ్‌ఓ పేరిట గ్రూపుల్లో మెసేజీలు
- లేదంటే ఉద్యోగాలు కష్టమంటూ హెచ్చరికలు

నెల్లూరు (అర్బన్): అధికారంలోకి రావడానికి కూటమి అధినేత చంద్రబాబు అలవికాని అమలు ఇచ్చారు. నిరుపేదలను ఆర్థికంగా సంపన్నులను చేస్తానంటూ 'పూర్ టు రిచ్' పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన ఈ ప్రణాళికను ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల డబ్బులతో అమలు చేసే ఎత్తుగడ వేశారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్‌షిప్ విధానంలో దాతల సొమ్ముతో ప్రభుత్వ ప్రచారానికి తెర తీశారు. వాస్తవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, జేసీ, డీఆర్వో, డీఎంహెచ్‌ఓ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉంది. అయితే వీరు ముఖం చాటేయడంతో నెల జీతంపై ఆధారపడి బతికే చిరు ఉద్యోగుల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరికి టార్గెట్ విధించి మెడపై కత్తి పెట్టారు. భారమంతా ఉద్యోగులపైనే వేస్తున్నారు. వైద్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో సీహెచ్‌ఓలుగా (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ లేదా ఎంఎల్‌హెచ్‌పీలు) పనిచేస్తున్న చిన్న ఉద్యోగులను ఆన్‌లైన్‌లో ముందుగా పీ4 రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వైద్యశాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ తీరును సీహెచ్‌ఓలు తీవ్రంగా నిరసిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ శుక్రవారం నిర్వహించిన కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాత్రం పీ4 అనేది స్వచ్ఛందంగా జరగాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలంటూ కూడా తెలిపారు. అయితే ఆచరణలో పెద్దలెవరూ పీ4కి ముందుకు రాలేదు. దీంతో వైద్యశాఖలోని చిన్న ఉద్యోగులపై బలవంతపు పీ4 రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

రూ.కోట్లకు పడగలెత్తిన నేతలు ఉండగా..

కూటమి పార్టీల్లో రూ.కోట్లకు పడగలెత్తిన నేతలు ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంపైగా ఊరూరా ఆ పార్టీల నేతలు ఇసుక, మట్టి, గ్రావెల్, మద్యం, పేకాట, కోళ్ల పందేలు, అక్రమ వ్యాపారాలతో రూ.కోట్లు సంపాదించారు. వీరందరిని వదిలేసి తమ వంటి చిరు ఉద్యోగులపై భారం పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

సీహెచ్‌ఓలపై తీవ్ర ఒత్తిడి

జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో 496 సీహెచ్‌ఓ పోస్టులున్నాయి. వీటిలో 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో 476 మంది పని చేస్తున్నారు. వీరి జీతం కేవలం రూ.25 వేలు మాత్రమే. ఈ జీతంలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఉన్న ప్రాంతం నుంచి చార్జీలు భరించాలి. వైద్యశాఖ నుంచి మందులు, ఇతరత్రా సామగ్రి తరలించేందుకు జేబులో నుంచే రవాణా ఖర్చు భరించాలి. బీఎస్సీ నర్సింగ్ వంటి ఉన్నత కోర్సులు చదివి ఎన్నో ఆశలతో వైద్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేరిన వీరికి చివరకు నెలంతా కష్టపడితే ఖర్చులు పోను రూ.20 వేలు వరకు మాత్రమే మిగులుతోంది. అలాంటి చిన్న ఉద్యోగులను పీ4 కింద రిజిస్ట్రేషన్ చేయించుకుని బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ రెండు రోజుల నుంచి మెడికల్ ఆఫీసర్లు తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు.

హామీలతో మోసం.. టార్గెట్లతో భారం

సీహెచ్‌ఓలు తమకు జీతాలు పెంచాలని, ఇన్సెంటివ్స్ చెల్లించాలని కోరుతూ నాలుగు నెలల క్రితం సమ్మె బాట పట్టారు. 46 రోజులు సమ్మె చేశారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల సందర్భంగా ఇన్సెంటివ్స్ మొత్తం ఒకేసారి చెల్లిస్తామని, సమ్మె కాలానికి జీతాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జీతాలు పెంచే విషయం కూడా పరిశీలిస్తామని చెప్పి సమ్మె విరమింప చేసింది. అయితే హామీలకు విరుద్ధంగా సమ్మె చేశారంటూ ఒక్కో నెలలో రూ.5 వేలు చొప్పున రెండు నెలలకు రూ.10 వేలు జీతాలు కట్ చేసి మిగతా మొత్తాన్ని సీహెచ్‌ఓల ఖాతాలో జమ చేశారు. ఇన్సెంటివ్స్ మొత్తం ఇస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం చేతిలో మోసపోయి తక్కువ జీతాలతో పని చేస్తున్న తమను ప్రభుత్వం మోసగించడమే కాకుండా పీ4 కింద పేద కుటుంబాలను దత్తత తీసుకోమని పేర్కొనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం

డీఎంహెచ్‌ఓ పేరిట మెసేజ్‌లు

> Good afternoon Medical Officers... On the instructions of DMHO madam adopt two familys by each MLHPs as Margadarshis as designed in Bangarukutumbham program and update immediately by the medical officers... Thank you
> 17:13

రెండు కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ డీఎంహెచ్‌ఓ పేరుతో సీహెచ్‌ఓలకు మెడికల్ ఆఫీసర్లు పంపిన మెసేజ్ (స్క్రీన్ షాట్)

డీఎంహెచ్‌ఓ పేరిట జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు వైద్యశాఖ గ్రూపులో సీహెచ్‌ఓలకు టెక్స్ట్ మెసేజీలు, వాయిస్ మెసేజీలు వాట్సాప్ గ్రూపులో పంపారు. శనివారం సాయంత్రం లోపు ఒక్కో సీహెచ్‌ఓ రెండు కుటుంబాలను దత్తత తీసుకుంటూ ఆన్‌లైన్‌లో పీ4 రిజిస్ట్రేషన్ తీసుకోవాలని సూచించారు. ఇది డీఎంహెచ్‌ఓ ఆదేశాలంటూ పేర్కొన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకోని వారందరూ ఇబ్బంది పడుతారంటూ ఓరల్‌గా హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులను, ప్రభుత్వ తీరును తిట్టుకుంటూ ఇప్పటికే పలువురు తమ పేర్లను పీ4 కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పెద్దలను వదిలేసి తమను బలి చేయడమేంటని సీహెచ్‌ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం నాయకులు

- బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాల్లేవ్
- కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం ధర్నా

నెల్లూరురూరల్: విద్యారంగాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని, బదిలీలు జరిగి 50 రోజులవుతున్న నూతన స్థానాల్లో చేరిన ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు ఇవ్వలేకపోవడం ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యానికి దర్పణమని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం నేతలు దుయ్యబట్టారు. తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో కో చైర్మన్ మాసప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులపై బోధనేతర కార్యక్రమాల భారాన్ని పెంచుతూ విద్యారంగం కునారిల్లేలా చేసిందన్నారు. ఫ్యాప్టో పరిశీలకులు ఎన్‌వీ రమణయ్య, రమేష్, పీవీ రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా, కనీసం రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, పెన్షన్, సరెండర్ లీవ్, డీఏ బకాయిలను చెల్లించకుండా తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే కొత్త పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ విడుదల చేసి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో 12వ తేదీ రాష్ట్ర స్థాయిలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ శేషు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని, బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. మరో డిప్యూటీ జనరల్ సెక్రటరీ హజరత్ మాట్లాడుతూ కామన్స్ సీనియారిటిని తుంగలో తొక్కి ప్రభుత్వ ఉపాధ్యాయులకే ఎంఈఓ–1 పోస్టులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వెంటనే కామన్ సర్వీస్ రూల్స్‌ను తీసుకొచ్చి జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో ఉన్న ఉపాధ్యాయులకూ న్యాయం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహం, మురళీకృష్ణ, భాస్కర్‌రెడ్డి, మణి, సుబ్బు, చలపతి శర్మ, దశరథరాములు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో 5న స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ 2025–26 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లకు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏసుదాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ కింద చేసిన విద్యార్థినులకు ఫీజు రాయితీ, స్కాలర్ షిప్ సౌకర్యం లేదన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఎస్ఎస్‌సీ మార్కుల లిస్టు, పాలిసెట్‌కు హాజరైతే హాల్ టికెట్, టీసీ, క్యాస్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజనల్స్, 3 సెట్లు జెరాక్స్ కాపీలు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలన్నారు. ఫీజు రూ.6 వేలు చెల్లించాలన్నారు. ఇతర వివరాల కోసం 99123 42048 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ నుంచి ఆజాదీ కా ఆఫర్

నెల్లూరురూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ఆఫర్‌ను ప్రవేశ పెట్టిందని టెలికామ్ డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సి అమరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలలో ఎవరైనా కొత్త సిమ్‌ను బీఎస్ఎన్ఎల్ నుంచి పూర్తి ఉచితంగా పొంది రూ.1కే 30 రోజులపాటు ప్రతి రోజు 2 జీబీ డేటా, ఉచిత కాల్స్ పొందవచ్చునని, ఇతర ఆపరేటర్ నుంచి పోర్టబులిటీ పెట్టుకున్న వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. వినియోగదారులు దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రంలో లేదా రిటైలర్‌ను సందర్శించి ఈ ఉచిత ఆఫర్‌ను పొందవచ్చునని అన్నారు.

వ్యవసాయం చేసే రైతులకే అన్నదాత సుఖీభవ

- జిల్లాలో 1,95,866 మందికే లబ్ధి
- కలెక్టర్ ఓ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కోవూరు: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే సాయం అందిస్తున్నట్లు, జిల్లాలో 1,95,866 మందికి రూ.131.6 కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. శనివారం కోవూరులోని పీవీఆర్ కన్వెన్షన్ హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా కారణంగా లబ్ధి పొందని రైతులు ఆగస్టు 3 నుంచి నిర్వహించనున్న గ్రీవెన్స్ మాడ్యూల్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకుంటే లబ్ధి పొందవచ్చు అన్నారు. రెండు కారణాలతో లబ్ధి చేకూరని పరిస్థితి ఉందన్నారు. ఒకటి బ్యాంకు ఆధార్ లింకు లేకపోవడం, సరైన వివరాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయకపోవడమే కారణమన్నారు. సాగు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్ కార్డులు) కలిగిన వారికి రబీ సీజన్లో తొలి విడతగా రూ.10 వేలు, ఖరీఫ్ సీజన్‌లో రూ.10 వేల చెల్లిస్తామని తెలిపారు. జిల్లాలో యాక్టివ్‌గా లేని అకౌంట్ ఉన్న వాళ్లు 4000 మంది, ఆధార్ లింకేజీ కాని వాళ్లు 2 వేల మంది ఉన్నారని, వీరంతా వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రైతులందరికీ అవసరమైన మేర ఎరువులు, విత్తనాలు మొదలైనవి అందజేస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి మాట్లాడుతూ మూడు నెలలుగా వ్యవసాయ అనుబంధ శాఖలు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామన్నారు. 27 వేల మంది చనిపోయిన రైతులు, రాంగ్ సీడింగ్ చేసిన రైతులు 18 వేల మంది ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ ఐ.మురళి, వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, ఏఓ రజని, ఎంపీపీ పార్వతి, సర్పంచ్ వై.విజయ, అమరావతి, బుచ్చి మున్సిపల్ చైర్మన్ సుప్రజ, వివిధ రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిట్ అధికారుల రెండు రోజుల కస్టడీకి కాకాణి



నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని గుంటూరు సీఐడీ పోలీస్ అధికారులు విచారణ నిమిత్తం 3, 4 తేదీల్లో రెండు రోజుల కస్టడీకి ఇస్తూ నెల్లూరు 2వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శారదరెడ్డి శనివారం ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేశారని వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో కాకాణిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గుంటూరు సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై పోలీసులు తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ ఈ కేసులో కాకాణి పాత్ర ఉందని, విచారించడానికి ఏడు రోజులు కస్టడీ అవసరం ఉందన్నారు. కాకాణి తరపు సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్దన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాల్లేవని, కేవలం రాజకీయ కక్షతో కాకాణిని 14వ నిందితుడిగా పోలీసులు చేర్చారని, పోలీస్ కస్టడీ ఇవ్వాల్సిన అవసరం లేదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి శారదరెడ్డి రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని ఈ నెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి గుంటూరు సీఐడీ పోలీసులు కస్టడీకి తీసుకోవాలని, 4వ తేదీ విచారణ అనంతరం సాయంత్రం 5 గంటలకు వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరుపరచాలని, విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించవద్దన్నారు. న్యాయవాది సమక్షంలో గోవర్ధన్‌రెడ్డిని సీఐడీ పోలీసులు విచారణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మైనింగ్ ఆపకపోతే ప్రాణత్యాగానికైనా సిద్ధం

- అనుమతులు రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదు
- ఆందోళన చేస్తున్న గ్రామస్తులను అడ్డుకున్న పోలీసులు, తోపులాట
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు



గ్రామంలో జరుగుతున్న ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

వరికుంటపాడు/ఉదయగిరి: వరికుంటపాడు పంచాయతీ జంగంరెడ్డిపల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన మైనింగ్ అనుమతులు ఆపకపోతే తాము ప్రాణత్యాగానికై నా సిద్ధమంటూ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శనివారం ఆందోళనకు దిగారు. మైనింగ్‌తో ఈ ప్రాంతానికి జరిగే అనర్థాలపై ప్రజల మద్దతు కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో వాల్‌పోస్టర్లు, ప్లకార్డులతో వరికుంటపాడు ప్రధాన రహదారిలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. శాంతియుతంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీని ఎస్సీ కాలనీ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. రెండు గంటలపాటు ఆందోళనకారులను కదలనీయకుండా పోలీసులు అటకాయించడంతో వాగ్వాదానికి దిగి నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొంతమంది ఆందోళనకారులు పోలీసులను నెట్టుకుంటూ ముందుకు పరుగులు తీసి గ్రామ ముఖద్వారం వరకు చేరుకుని జాతీయ రహదారిపై నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆందోళనకారులను జాతీయ రహదారి పైకి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు,పోలీసుల మధ్య పలు మార్లు తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పరిస్థితి తీవ్రం కావడంతో పరిస్థితి ఎలా పరిణమిస్తుందోనన్న భయాందోళన స్థానికుల్లో కనిపించింది. పరిస్థితి అదుపుదాటుతుండటంతో ఉదయగిరి సీఐ కె.వెంకట్రావు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున తర్వాత జరిగే పరిణామాలకు మీరే బాధ్యత వహించాలని హెచ్చరించారు. జేఏసీ కన్వీనరు, గ్రామ సర్పంచ్ దిలీప్‌కుమార్ ఘాటుగా స్పందిస్తూ శాంతియుత ర్యాలీని అడ్డుకునే హక్కు మీకు ఎవరు కల్పించారని పోలీసుల్ని నిలదీశారు. ప్రజలను చైతన్యం చేసేందుకు తాము చేస్తున్న పోరాటాన్ని పోలీసులు హింసాత్మక ఘటనగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మా ప్రాణాలు పోతున్నా మీకు పట్టవా.. ఎవరి ప్రయోజనాలు ఆశించి మమ్మల్ని కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. మమ్మల్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా తమ పోరాటం ఆగదని, మైనింగ్ రద్దు చేయకపోతే తమ శవాలపై నడిచి మైనింగ్ చేసుకోవాలని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఆందోళనకారులు జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తారన్న సమాచారంతో వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి ఎస్సైలు రఘునాథ్, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీగా పోలీసులను జాతీయ రహదారి ప్రధాన కూడళ్ల వద్ద పహారా పెట్టారు. అయినా ఆందోళనకారులు లెక్క చేయకుండా గ్రామంలో ర్యాలీ చేపట్టి అనంతరం జాతీయ రహదారి వద్దకు చేరుకునే ప్రయత్నంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.అనంతరం జేఏసీ కన్వీనర్ దిలీప్‌కుమార్, నాయకులు ఆంద్రా పరంధామిరెడ్డి, షేక్ పీరయ్య, సరాబు లక్ష్మీనారాయణ, సుంకర రాధాకృష్ణ, తదితరులను సీఐ వెంకట్రావు స్టేషన్‌కు పిలిపించి మరోసారి ఆందోళన కార్యక్రమాలు చేపడితే కేసులు పెడతామని తీవ్రంగా హెచ్చరించారు. అయితే దీనివెనుక టీడీపీకి చెందిన కొంత మంది నేతలు తెరవెనుక ఉండి ఆందోళనకారులను రెచ్చగొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

సంగం: నెల్లూరు – ముంబై రహదారిలో సంగం చెక్‌పోస్టు సెంటర్ వద్ద విజిలెన్స్ అధికారులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా తిరుగుతున్న పలు భారీ వాహనాలను విజిలెన్స్ సీఐ సుభాన్ ఆపి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

క్లుప్తంగా

అప్పుల బాధ తాళలేక బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరులోని వల్లూరమ్మ కాలనీకి చెందిన పుల్లయ్య (51) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. మనస్పర్థల కారణంగా భార్య, కుమారుడు దూరంగా ఉంటున్నారు. రూప అనే మహిళతో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి రెండు నెలల పాప ఉంది. మద్యానికి బానిసైన ఆయన సంపాదనకు మించి అప్పులు చేశారు. వీటిని తీర్చలేకపోతున్నానని, చనిపోవాలనిపిస్తోందంటూ కుటుంబసభ్యులకు తెలపగా, వారు సర్దిచెప్పారు. ఈ తరుణంలో తన ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని గత నెల 28న సేవించారు. ఆపై ఇంటికెళ్లి వాంతులు చేసుకుంటూ జరిగిన విషయాన్ని రూపకు చెప్పారు. సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. మరుసటి రోజు తిరిగి వాంతులు చేసుకుంటుండటంతో విషయాన్ని పుల్లయ్య అక్కలు ఎం శారద, వై శారదకు తెలియజేశారు. హుటాహుటిన ఇంటికి చేరుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో పుల్లయ్యను చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు మృతుడి అక్క ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు.

లోడ్ క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గృహ వినియోగదారులు తమ అదనపు విద్యుత్ లోడ్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు సంబంధించిన గడువును పొడిగించారని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31లోపు అవకాశం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.24
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.114
లేయర్	: రూ.112
బ్రాయిలర్ చికెన్	: రూ.210
స్కిన్‌లెస్ చికెన్	: రూ.234
లేయర్ చికెన్	: రూ.190



వర్ణశోభిత సంధ్యవేళ



ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు తన తాపంతో భూమిని దహించగా, సంధ్య వేళకు కోపం వదిలేసి కాంతుల కళలను ఆవిష్కృతం చేశారు. ఎర్రని పువ్వులేరు పుతో నింగిని రంగుల హరివిల్లు చేసి, ప్రకృతి అందాలతో మనసులు మురిపించాడు. బారాషహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువు వద్ద వినీలాకాశం తనవైపు చూసే ప్రతి చూపును మంత్రముగ్ధుల్ని చేసింది. నీలిగగనంలో కుంకుమ పువ్వుల వర్ణం చిమ్మినట్టుగా, నీటిపై ప్రతిబింబించిన ఆ కాంతులు స్వర్ణ శోభితంగా ఆవిర్భవించాయి. ప్రకృతి మాధుర్యాన్ని పెయింటింగ్ వేసినట్టుగా, రంగుల తోరణంగా శనివారం సాయంత్రం వర్ణశోభితంగా మారింది స్వర్ణాల చెరువు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





అధికారుల తీరుపై అసహనం

- నిధులు మంజూరు చేసినా.. పనులు ప్రారంభించరా..?
- ఇసుక ఫ్రీ అంటున్నా అధిక ధరలకు విక్రయం
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాలు, డీపీఆర్సీ భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేసి నెలలు గడుస్తున్నా, అధికారుల్లో స్పందన లేదని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అసహనం వ్యక్తం చేశారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. డీపీఆర్సీ భవనానికి అనుమతులను ఆర్నెల్ల క్రితం మంజూరు చేస్తే, టెండర్ల ప్రక్రియను పూర్తి చేయలేదని చెప్పారు. వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఇసుక ఉచితమని ప్రభుత్వం చెప్తున్నా, ట్రాక్టర్‌కు రూ.నాలుగు వేలను చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. దీనికి సంబంధించిన సీనరైజ్ జెడ్పీకి రావడంలేదన్నారు. అయితే ఇసుక ఉచితం కావడంతో ఇది రాదని అధికారులు బదులిచ్చారు.

రీచ్‌కు ఎలా అనుమతిచ్చారు..?

కలువాయి మండలం రాజుపాళెంలో రీచ్‌కు ఎలా అనుమతిచ్చారంటూ మైనింగ్ శాఖ అధికారులను జెడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. 500 మీటర్ల పరిధిలో బోర్లుంటే అనుమతులను ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. తెలుగురాయపురం రీచ్‌లోనూ ఇదే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశించారు. పీ4 పథకానికి సంబంధించి పూర్తిస్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు అప్పగించాలన్నారు.

అస్తవ్యస్తంగా జలజీవన్ మిషన్ పనులు

జలజీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా మారాయని ఆనం అరుణమ్మ అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగ తగలి పశువులు మరణించి ఆర్నెల్లవుతున్నా, బీమా అందలేదని, దీనిపై కలెక్టర్‌కు సమాచారమిచ్చినా నేటికీ స్పందన లేదని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై నుంచి చికెన్ వ్యర్థాలు జిల్లాకు అధిక మొత్తంలో వస్తున్నాయని, వీటిని అరికట్టడంలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. అనంతరం ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్షించారు. సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘యాక్సిస్’ కుంభకోణంపై పోరాటం



రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో జరిగిన యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంపై దశల వారీగా పోరాటం చేస్తామని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య స్పష్టం చేశారు. యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంపై నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పలు సంఘాలు, రాజకీయ పార్టీలతో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై పోలీసులు నేటికీ విచారణ జరపలేదని, కారకులను కాపాడేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అమాయక గిరిజనుల పేరుతో ముత్తుకూరులోని బ్యాంక్‌లో రూ.కోట్లలో రుణాలు తీసుకోవడం దారుణమన్నారు. ఈ ఉదంతంపై అన్ని రాజకీయ పార్టీలతో కలిసి దశలవారీగా న్యాయ, ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద నిరసనను సోమవారం చేపట్టనున్నామని పేర్కొన్నారు. సమగ్ర విచారణకు రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామరాజు, ఏఆర్డీ చైర్మన్ బషీర్, రజక సంఘ నేతలు పద్మజ, పోలయ్య, రఘు, కోటయ్య, యానాదుల సంఘ నేతలు కృష్ణయ్య, రవీంద్రబాబు, ఉషా తదితరులు పాల్గొన్నారు..

ఉదయగిరిలో చోరీ

- పది సవర్ల బంగారం, రూ.30 వేల అపహరణ

ఉదయగిరి: పట్టణంలోని కరీమా వీధిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కరీమావీధికి చెందిన మీరా మొహిద్దీన్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లగా.. భార్య ఖాదరున్నీసా ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో రోజులానే పట్టణంలోని తన బంధువుల ఇంటికెళ్లి నిద్రించారు. ఇంట్లో ఆమె లేరనే అంశాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు.. గోడ దూకి ప్రధాన తలుపు తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. పడక గది తాళాలను పగలగొట్టి, లోపల ఉన్న బీరువా తాళాలు తీసి బంగారు గాజులు, కమ్మలు, ఉంగరాలు, ముక్కు పుడకలు, చెంపసవరం తదితర పది సవర్ల బంగారు, వెండి వస్తువులతో పాటు రూ.30 వేలను దోచుకెళ్లారు.

ఉదయం ఇంటికి చేరుకున్న ఖాదరున్నీసా చోరీ విషయాన్ని నిర్ధారించుకొని బోరున విలపించి బంధువులకు తెలియజేశారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్సై ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి నివాసానికి వెళ్లి పరిశీలించి వివరాలను సేకరించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగుకు గడ్డు పరిస్థితి

- కండలేరు పంపింగ్ స్కీమ్‌కు రిపేర్లు
- ప్యానల్ బోర్డు మార్చేందుకు యత్నం
- ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత కరువు
- నీటి విడుదల వాయిదా



లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టమ్‌లో హెవీ మోటార్లు

పొదలకూరు: కండలేరు పంపింగ్ స్కీమ్‌కు రిపేర్లు తలెత్తడంతో దాదాపు 20 వేల ఎకరాల్లో సాగుకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి కండలేరు ఎడమ గట్టు కాలువకు పంపింగ్ స్కీమ్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఈ తరుణంలో హెవీ మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే సబ్‌స్టేషన్లో సాంకేతిక లోపం తలెత్తడంతో మరమ్మతులు చేయించారు. ఈ నేపథ్యంలో కాలువకు నీటిని పంపింగ్ చేసేందుకు శనివారం యత్నించగా, ప్యానల్ బోర్డులో ఏర్పడిన సాంకేతిక కారణాలతో వీలుపడలేదు. దీంతో బోర్డును పూర్తి స్థాయిలో మార్చేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

లభ్యంకాని సామగ్రి

ఒక్కో మోటార్ 2050 హెచ్‌పీ సామర్థ్యం కలిగి ఉంది. పంపింగ్ స్కీమ్‌కు ఉపయోగించే సామగ్రి ఈ ప్రాంతంలో లభ్యం కాదు. ఫలితంగా చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి తెప్పించాల్సి ఉంది. కండలేరు ఎడమ గట్టు హైలెవల్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు కాలువను నిర్మించారు. అయితే స్లూయిజ్ ఎత్తులో ఉండటంతో కండలేరు జలాశయంలో 35 టీఎంసీలకుపైగా నీరు నిల్వ ఉంటేనే, గ్రావిటీ ద్వారా కాలువకు అందుతుంది. అయితే ప్రస్తుతం 26 టీఎంసీలే నిల్వ ఉంది.

ప్యానల్ బోర్డు మార్చాలి

కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టమ్ నుంచి ఎడమ గట్టు కాలువకు నీటిని పంపింగ్ చేసేందుకు అంతా సిద్ధం చేశాం. అయితే హెవీ మోటార్లకు సంబంధించిన ప్యానెల్ బోర్డు ఎక్కడా లభ్యం కాలేదు. దీంతో బోర్డును తెప్పించే యత్నాల్లో ఉన్నాం. సాధ్యమైనంత త్వరగా నీటిని పంపింగ్ చేయనున్నాం.

– విజయరామిరెడ్డి, తెలుగుగంగ డీఈ

లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టమ్ నిర్మాణం

గ్రావిటీ ద్వారా ఎడమ కాలువకు నీరు అందకపోతే మెట్ట ప్రాంత రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా లోలెవల్ స్లూయిజ్ వద్ద లిఫ్ట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సుమారు 6.5 కిలోమీటర్ల మేర రెండు పైప్‌లైన్లను నిర్మించి ఎడమ కాలువకు కలిపారు. గ్రావిటీ ద్వారా నీరందని సమయంలో లిఫ్ట్ సిస్టమ్ ద్వారా లోలెవల్ స్లూయిజ్ నుంచి కాలువకు అందిస్తారు. అయితే లిఫ్ట్ ప్రక్రియ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో అవసరాలకు నీటిని పంపింగ్ చేయలేకపోతున్నారు. సామగ్రిని తెప్పించేందుకు తెలుగుగంగ ఇంజినీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

జిల్లాలో శనివారం చోటుచేసుకున్న మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా, ఒకరు గాయపడ్డారు. ముత్తుకూరు మండలంలో యువకుడు.. గుడ్లూరు మండలం చేవూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి.. కావలి రైల్వేస్టేషన్ వద్ద కారు చక్రాల కింద నలిగి యాచకురాలు మృతి చెందారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..



ముత్తుకూరు (పొదలకూరు): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాసులురెడ్డి వివరాల మేరకు.. చలివేంద్రం గ్రామానికి చెందిన కార్తీక్ (19), హర్షవర్ధన్ బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో ముత్తుకూరు సమీపంలోని మద్దిమాను వద్ద వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో కార్తీక్ (19) మృతి చెందగా, హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డారు. నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో క్షతగాత్రుడు చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొనడంతో..



గుడ్లూరు: వాహనం ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై చేవూరు వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నామని ఎస్సై వెంకట్రావు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 91211 02206 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు చక్రాల కింద నలిగి..

కావలి (జలదంకి): గుర్తుతెలియని కారు చక్రాల కింద నలిగి యాచకురాలు మృతి చెందిన ఘటన కావలి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. కావలి ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గురవమ్మ (21) యాచిస్తూ జీవనం సాగిస్తున్నారు. స్టేషన్ వద్ద ఆటోలు నిలిపే ప్రాంతంలో నిద్రించేవారు. ఈ క్రమంలో గుర్తుతెలియని కారు ఆమెపైకెక్కింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. గమనించిన ఆటోడ్రైవర్లు.. పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎస్సై సుమన్ సూచనల మేరకు దహన సంస్కారాలను అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మోహన్ నిర్వహించారు.